క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బేతంచెర్ల: స్థానిక గౌరిపేటలోని చెన్న కేశవస్వామి ఆలయంలో వెలసిన అలిమేలు మంగమ్మ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అక్టోబర్ 12వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆయా రోజుల్లో ప్రత్యేక పూజలతో పాటు ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం కల్యాణోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.

వేలంలో రూ.3.42 లక్షల ఆదాయం



చౌడేశ్వరి ఆలయం వద్ద వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

బనగానపల్లె: నందవరంలోని చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద కూల్‌డ్రింక్స్ నిర్వహణకు గురువారం వేలం పాట నిర్వహించారు. ఆలయపర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో పి.ఆంజనేయులు రూ.3.42 లక్షలకు దక్కించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి, ఆలయ సిబ్బంది ఉన్నారు.

ఎక్సైజ్ సీఐగా బాధ్యతల స్వీకరణ



తాకీబాషా

కోవెలకుంట్ల: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ సీఐగా తాకీబాషా గురువారం బాధ్యతలు తీసకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న సీఐ వర్దనాదేవి బనగానపల్లెకు బదిలీ కాగా ఆ స్థానంలో అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న తాకీబాషా కోవెలకుంట్లకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో నాటుసారా అమ్మకాలు, బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయాలను అరికడతామని పేర్కొన్నారు.

బదిలీ సన్మానం



సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ సచివాలయం-1,2 నుంచి బదిలీ అవుతున్న పలువురు ఉద్యోగులను గురువారం సన్మానించారు. సచివాలయం-1 వీఆర్వో శివకృష్ణ కర్నూలుకు, పంచాయతీ కార్యదర్శి బషీరున్‌బీ ఓర్వకల్లు మండలం నన్నూరుకు, సిమెంట్‌నగర్ సచివాలయం-2 పంచాయతీ కార్యదర్శి రాజేష్ బుగ్గానిపల్లె తండకు బదిలీ అయ్యారు. వీరిని గ్రామ సర్పంచ్ ఏస్తేరమ్మ, ఉప సర్పంచ్ మమత, జూనియర్ అసిస్టెంట్ ఏసయ్య, తదితరులు సన్మానించి వారి సేవలను కొనియాడారు.

గాయపడిన బాలుడికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న నాయీబ్రాహ్మణులు

డోన్: ఇటీవల కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం మదార్‌పురం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మోక్షిత్(4) కుటుంబానికి డోన్ నాయీబ్రాహ్మణ సంఘం రూ.56 వేల ఆర్థిక సాయం చేసింది. గురువారం మోక్షిత్ కుటుంబ సభ్యుడు నాగలింగంకు నగదు అందజేసింది. నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు సోమశేఖర్, మద్దయ్య, తిరుపాల్, గోపాల్, సోమన్న ఉన్నారు.

బ్యాడ్మింటన్‌లో ఉచిత శిక్షణ



మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్: దసరా సెలవుల్లో విద్యార్థులకు టెన్నిస్, బ్యాడ్మింటన్ క్రీడల్లో పది రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. టెన్నిస్‌ను స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న టెన్నిస్ కోర్టులో, షటిల్ బ్యాడ్మింటన్ శిక్షణను బుగ్గన శేషారెడ్డి ఇండోర్ స్టేడియంలో ఇవ్వనున్నట్లు చెప్పారు. శుక్రవారం నుంచి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం విద్యార్థులకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 9490494749, 8985702633 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



డోన్: పాతబస్టాండ్‌లో..



డోన్: గాయత్రి పీఠంలో బాలాత్రిపురసుందరిగా..



డోన్: మహాలక్ష్మిగా కనకదుర్గ



డోన్: రాజరాజేశ్వరి అలంకరణలో వాసవీమాత



కోవెలకుంట్ల: రాజరాజేశ్వరీదేవిగా..



కోవెలకుంట్ల: బాలాత్రిపురసుందరిగా మారెమ్మ



బేతంచెర్లలో..

జగజ్జననీ నమోస్తుతే

- దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు
- ఆలయాల్లో విశేష పూజలు

డోన్ టౌన్: దసరా శరన్నవాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. డోన్ పట్టణంలోని అమ్మవారిశాలలో వెలసిన కన్యాకాపరమేశ్వరి మొదటి రోజు శ్రీరాజరాజేశ్వరి అలంకరణలో భక్తులను కటాక్షించారు. అలాగే గాయత్రీ పీఠంలోని అమ్మవారు బాలాత్రిపురసుందరి దేవిగా, కనకదుర్గ విజయమల్లేశ్వరి స్వామి ఆలయంలోని అమ్మవారిని శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించారు. పాత బస్టాండ్‌లో భవాని భక్తులు అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు.

-కోవెలకుంట్ల: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో మొదటి రోజు నిర్వహించిన పూజకు పట్టణానికి చెందిన గోనెగండ్ల క్రిష్ణమూర్తి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మారెమ్మ, ప్రసన్న భారతీదేవి ఆలయాల్లో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో పూజలందుకున్నారు.



బేతంచెర్ల: బాలాత్రిపుర సుందరిదేవిగా భావించి చిన్నారికి పూజలు చేస్తున్న మహిళలు



కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలో బాలాత్రిపురసుందరిగా..

- **కొలిమిగుండ్ల:** మండలంలోని అంకిరెడ్డిపల్లె గీతాశ్రమంలో రాజరాజేశ్వరిదేవి బాలాత్రిపురసుందరిగా భక్తులను అనుగ్రహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అలాగే తిమ్మనాయినపేటలోని వాసవీ కన్యాకపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.



బనగానపల్లెలో వాసవీదేవి

- **బనగానపల్లె రూరల్:** మండల వ్యాప్తంగా దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు శ్రీశైలపుత్రి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, పంచామృతాభిషేకం, సహస్ర, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే కొండపేట వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి, అయ్యప్పస్వామి ఆలయంలోని గాయత్రీదేవి బాలాత్రిపుర సుందరీదేవిగా పూజలందుకున్నారు.



బేతంచెర్ల: మద్దిలేటిస్వామి ఆలయంలో కాత్యాయినిదేవిగా మహాలక్ష్మి

మహాలక్ష్మీగా కాత్యాయనిదేవి

బేతంచెర్ల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారు కాత్యాయనిదేవి అలంకరణలో భక్తులకు అభయమిచ్చారు. ఆలయ వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో ఉదయం గోపూజ, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం తదితర పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని కాత్యాయని దేవిగా అలంకరించి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. రాత్రి గజవాహనంపై కొలువుంచి మంగళవాయిద్యాల నడుమ ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే బేతంచెర్ల అమ్మవారిశాలలోని వాసవీమాతను బాలాత్రిపుర సుందరీదేవిగా కొలువుంచి పూజలు చేశారు. ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా వాసవీమాత

ప్యాపిలి: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం ఉదయం పతాకావిష్కరణను నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ పూజ, మహాన్యాస రుద్రాభిషేకం, కుంకుమార్చన, చండీహోమం నిర్వహించారు. సాయంత్రం స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా వాసవీమాత దర్శనమిచ్చారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న ఏఓ నిరంజన్

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగు చేసిన రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. గురువారం మండలంలోని జోళదరాశి, కలుగొట్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభల్లో ఆయన మాట్లాడుతూ.. రబీసీజన్‌లో సాగు చేయనున్న పప్పుశనగ, జొన్న విత్తనానికి ముందు డీఏపీ ఎరువుకు బదులు ఇతర కాంప్లెక్స్ ఎరువులు వినియోగించుకోవచ్చని తెలిపారు. వివిధ పంటల్లో సాధ్యమైనంత వరకు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని పేర్కొన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి విజయలక్ష్మి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి

డోన్ టౌన్: వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యం సాధిస్తే ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. స్థానిక పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో దసరా సెలవుల సందర్భంగా సమగ్ర శిక్ష స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులైన ఎలక్ట్రానిక్స్, ఐటీ తదితర రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు మహేష్, అల్లీపీరాల పర్యవేక్షణలో పట్టణంలోని ఫోటాన్, సాయి ఇన్‌స్టిట్యూట్‌లలో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి



బార్ కౌన్సిల్‌కు వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

డోన్ టౌన్: పలు రాష్ట్రాల్లో అమలవుతున్న అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను ఏపీలో కూడా అమలు చేయాలని డోన్ బార్ కౌన్సిల్ మాజీ కోశాధికారి పులిదామోదర్ కోరారు. గురువారం అనంతపురంలో బార్ కౌన్సిల్ అధ్యక్షుడు గురుప్రసాద్, సభ్యులను కలిసి వినతి పత్రం అందజేశారు. న్యాయవాదులపై దాడులు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సంజామల: పేరుసోముల సబ్‌స్టేషన్ ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. త్రీ ఫేస్ కరెంట్ ఉదయం 4 గంటల నుంచి వస్తుందని.. రైతులు గమనించాలని పేర్కొన్నారు.

ఆవోపా నూతన కార్యవర్గం



ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు హరికిషన్‌ను సత్కరిస్తున్న కార్యవర్గం

డోన్ టౌన్: డోన్ ఆవోపా నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. పట్టణంలోని ఎస్కేపీ హైస్కూల్‌లో అధ్యక్షుడిగా మాకం రంజిత్ కిరణ్, ప్రధాన కార్యదర్శిగా జొన్నలగడ్డ శ్రీనివాసులశెట్టి, కోశాధికారిగా శేగు సుదర్శన్‌రావుతో పాటు మరో 37 మంది కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్, ఆవోపా రాష్ట్ర కార్యదర్శి శివపురం నాగరాజు, రాష్ట్ర ఉప కన్వీనర్ నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఆత్మకూరు సుబ్రమణ్యంశెట్టి, కార్యదర్శి జోహార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



వడ్డె మంజుల సుప్రియ (ఫైల్)

సంజామల: మండల పరిధిలోని అక్కంపల్లె గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. ఆయన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వడ్డె మంజుల శ్రీనివాసులు, లక్ష్మీదేవి దంపతులకు ముగ్గురు సంతానం. సెప్టెంబర్ 27వ తేదీ ఉదయం శ్రీనువాసులు దంపతులు కూలి పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చే సరికి పెద్ద కుమార్తె వడ్డె మంజుల సుప్రియ కనిపించలేదు. బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులను ఆశ్రయించారని.. ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బస్‌పాస్‌ల జారీ తాత్కాలికంగా నిలిపివేత

డోన్ టౌన్: సాఫ్ట్‌వేర్ ఆధునీకరణ కారణంగా ప్రయాణికులు, విద్యార్థులకు బస్ పాస్‌ల జారీని తాత్కాలికంగా నిలిపివేసినట్లు డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బస్సు పాసులు ఇచ్చే సాఫ్ట్‌వేర్ ఈ నెల 5, 6 తేదీల్లో అప్‌డేట్ చేస్తుండడం వల్ల అంతరాయం ఉంటుందన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి యథావిధిగా బస్సు పాసుల కౌంటర్‌లో జారీ చేస్తామని పేర్కొన్నారు. ప్రయాణికులు, విద్యార్థులు గమనించాలని సూచించారు.

ఈనెల 6న డోన్ మీదుగా స్పెషల్ రైలు

డోన్ రూరల్: ఈనెల 6వ తేదీ సికింద్రాబాద్ నుంచి కర్నూలు సిటీ, డోన్ మీదుగా వాస్కోడిగామాకు స్పెషల్ రైలు(07039) నడుస్తుందని డోన్ రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11:45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి సాయంత్రం 4:50 గంటలకు డోన్ చేరుకుంటుందన్నారు. అలాగే ఈనెల 9వ తేదీ నుంచి వారంలో రెండు సార్లు సికింద్రాబాద్ నుంచి వాస్కోడిగామాకు, వాస్కోడిగామా నుంచి సికింద్రాబాద్‌కు రైలు నడుస్తుందని పేర్కొన్నారు.

బేతంచెర్ల ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



ఫజుల్ రహిమాన్

బేతంచెర్ల: స్థానిక ఎంపీడీఓగా ఫజుల్ రహిమాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న వెంగన్న అవుకు మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్యాపిలిలో పనిచేస్తున్న ఫజుల్ రహిమాన్ బేతంచెర్ల మడలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీఓకు ఆయా పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు

కొలిమిగుండ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం డిప్యూటీ తహసీల్దార్‌గా విశ్వతేజ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ నాగేశ్వరరెడ్డి బనగానపల్లె సీఎస్‌డీటీకి బదిలీ అయ్యారు. నంద్యాల కలెక్టరేట్‌లో విధులు నిర్వహించే విశ్వతేజను బదిలీల్లో భాగంగా కొలిమిగుండ్ల డీటీగా నియమించారు.

వెలుగు ఏపీఎంగా శేఖర్

కోవెలకుంట్ల: వెలుగు ఏపీఎంగా శేఖర్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న ఏపీఎం గురుస్వామి సంజామల మండలానికి బదిలీ కాగా ఆ స్థానంలో ఆ మండలంలో పనిచేస్తున్న శేఖర్‌ను ఇక్కడ నియమించడంతో విధుల్లో చేరారు.

డీఏ ప్రకటించాలి

కోవెలకుంట్ల: 2024 జనవరి డీఏను దసరా కానుకగా ప్రకటించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజ్ వీరబ్రహ్మం కోరారు. గురువారం కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఏపీజీఎల్ఐ, పీఎఫ్ పరిణతి చెందిన నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నూతన పీఆర్సీ జులై 2023 నుంచి అమలు చేయాలని.. సముచిత రీతిలో మధ్యంతర భృతి ఇవ్వాలని కోరారు.

తిమ్మారెడ్డి మృతికి నివాళి

కొలిమిగుండ్ల: గొర్విమానుపల్లె ఎంపీటీసీ సభ్యుడు పులి ప్రకాష్‌రెడ్డి తండ్రి తిమ్మారెడ్డి(69) అనారోగ్యంతో మృతిచెందారు. గురువారం ఆయన మృతదేహానికి పలువురు నివాళులర్పించారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పేరం సత్యనారాయణరెడ్డి, రామసుబ్బయ్య, మాజీ ఎంపీపీ రామాంజనేయులు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి

బనగానపల్లె: చదవుకోవాలని తండ్రి మందలించడంతో ఆత్మహత్యకు యత్నించిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. ఎస్ఐ వెంకట సుబ్బయ్య వివరాల మేరకు.. మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన చాకలి నాగరాజు కుమారుడు చాకలి నాగభరత్ (20) పదో తరగతి వరకు చదివి కుటుంబ జీవనం కోసం మినరల్ వాటర్ సరఫరా చేసేవాడు. కొద్ది రోజుల నుంచి పని మానేశాడు. ఈ క్రమంలో తండ్రి నాగరాజు చదువుకోవాలని మందలించాడు. మనస్తాపం చెందిన నాగభరత్ సెప్టెంబర్ 29వ తేదీ పురుగుల మందుతాగాడు. కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తుల కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాల్లో నూతన మద్యం పాలసీ ప్రకారం 11 ప్రైవేట్ మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు తెలిపారు. గురువారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోవెలకుంట్ల మండలంలో ఐదు, సంజామల మండలంలో నాలుగు, దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాల్లో ఒక్కో మద్యం దుకాణం ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. గతంలో ఒక వ్యక్తికి ఒకే షాపునకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేదని, ప్రస్తుతం ఒక్కో షాపునకు రూ. 2 లక్షల చొప్పున ఎన్ని మద్యం షాపులకైనా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ లాటరీ పద్ధతిలో షాపులు కేటాయిస్తామని వెల్లడించారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 11 షాపులకు రూ. 55 లక్షల లైసెన్స్ ఫీజు నిర్దేశించామని పేర్కొన్నారు. లాటరీలో మద్యం షాపు పొందిన వ్యక్తి ఏడాదికి నాలుగు విడతల్లో ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉందన్నారు. మొదటి విడతలో రూ. 13.75 లక్షలు చెల్లించి లైసెన్స్ పొందాలని సూచించారు. రెండో సంవత్సరం లైసెన్స్ ఫీజుకు అదనంగా పదిశాతం చెల్లించాలన్నారు. ఆయనతో పాటు ఎక్సైజ్ సీఐ తాకీబాషా, ఎస్ఐలు ప్రవీణ్‌నాయక్, సందీప్‌యాదవ్ ఉన్నారు.

ఎంపీడీఓగా బీవీ రమణ బాధ్యతలు



ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది

బనగానపల్లె రూరల్: స్థానిక ఎంపీడీఓగా బీవీ రమణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా పగిడ్యాల మండలంలో పనిచేస్తున్న బీవీ రమణ బనగానపల్లెకు వచ్చారు. అంతకు ముందు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఏఓ నాగరాజు వ్యవహరించారు. నూతన ఎంపీడీఓను ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



పలుకూరులో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అర్చకులు

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు రామేశ్వరస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబరు 308లోని స్థలంలో గ్రూపు టెంపుల్స్ ఈఓ బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఆలయ అర్చకులు భాస్కయ్య ప్రభుత్వ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సర్వే నంబరులోని సుమారు 4 ఎకరాల్లో కోట్ల విలువైన నాపరాతి ఉంది. ఇప్పటికే కొందరు అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారు. గ్రామస్తులు, భక్తుల ఫిర్యాదు మేరకు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆలయ అర్చకులు, అధికారులు హెచ్చరించారు.

బదిలీ సన్మానం



బదిలీపై వెళ్తున్న అధికారులను సన్మానిస్తున్న ఎంపీపీ

డోన్ రూరల్: మండలంలో పనిచేసి బదిలీపై వెళ్తున్న అధికారులను స్థానిక షాదీఖానాలో గురువారం సన్మానించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, సీనియర్ అసిస్టెంట్ సుధీర్, ఈఓఆర్డీ జయరాంలను ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు బదిలీలపై వెళ్లడం సర్వసాధారణమన్నారు. డోన్ మండలంలో గత ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. దీనికి అధికారుల కృషి ఎంతో ఉందన్నారు. ప్రజలు వారిని ఎప్పుడూ గుర్తించుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాజ్‌కుమార్‌యాదవ్, నాయకులు జయచంద్రారెడ్డి, బొబ్బల శివరాం రెడ్డి, ఏఈ నారాయణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి చేరిన వృద్ధురాలు

డోన్: కర్నూలు జిల్లా సి.బెళగల్‌కు చెందిన నాగలక్ష్మి(85)కి డోన్ వైఎస్ నగర్‌లోని వృద్ధాశ్రమం ఆశ్రయం కల్పించింది. ఆమె భర్త హనుమంతు మృతిచెందడంతో కొడుకు వద్ద నివసిస్తుండేది. కొడుకు తాగుడుకు బానిస కావడంతో కోడలు అతనిని వదిలి వెళ్లిపోయింది.

అయినా కొడుకులో మార్పు రాకపోవడం, ప్రతి నెలా వచ్చే పెన్షన్ కోసం తనను వేధించి నగదు ఎత్తుకెళ్లేవాడు. తనను ఏదైనా ఆశ్రమంలో చేర్పించాలని కనపడిన వారినల్లా వేడుకుంటుండడం చూసిన వ్యక్తి డోన్ వృద్ధాశ్రమానికి తీసుకొచ్చినట్లు నిర్వాహకుల్లు జాన్‌ప్రభాకర్, భారతి తెలిపారు.



వృద్ధురాలిని ఆశ్రమంలో చేర్చుకుంటున్న నిర్వాహకులు